# నిజం చెప్తావా, లేదా?

(కథానిక)

కీర్తి వర్ధనుడు సముద్రపు ఒడ్డున కూర్చుని ఆకాశం సముద్రపుటంచులను తాకే దృశ్యం చూస్తున్నాడు. ఉప్పొంగివస్తున్న అలలు అతని మనసులో అలజడిని కలుగజేస్తున్నవి. అవును. సముద్రం సంతోషంతో విర్రవీగిపోతున్నది. మరి తనో, తనలో ఉత్సాహంలేదు. తనకు అంతా చీకాకుగా ఉన్నది.

"నేనిక మామయ్య దగ్గరకు పోను, నాకు చదువు అక్కర్లేదు."

కీర్తివర్ధనుడికి ఆలోచనలు మెఱుపులా తళుక్కుమన్నాయి. చెప్పులుకుట్టుకుండే వాడిదగ్గర ఉన్న కుర్రవాడు, తనుబడికి పోయే దోవలో బూట్ పాలిష్ పెట్టే కుర్రవాడు, ప్రతిరోజు ఉదయం తన మామయ్యకు 'పేపరు' తెచ్చి ఇచ్చేవాడు మొదలైనవాళ్ళంతా తన మనసులో మెదిలారు. (వాళ్లంతా తనకు ఈడైన వాళ్ళు.)

వాళ్లంతా చదువుకున్నారా? ఊహు, లేదు. అయితేవాళ్లు ఏదో రకంగా బ్రతుకుతున్నారే. వాళ్లను ఎవరూ అనవసరంగా అనరు. దొంగతనం చేశావనరు - తిట్టరు - కొట్టరు. వాళ్లు స్వేచ్ఛగా బ్రతుకుతున్నారు.

మరి అత్తయ్యకు నేనంటే ఎందుకూ అంత కోపం? నే నేపాపమూ ఎరుగను. ఇంట్లో చిల్లర డబ్బులు కన్పించలేదని, అవి నేనే తీశానని మామయ్యతో చెప్పి దెబ్బలు కొట్టించింది. మామయ్య తనకున్న కోపమూ బలమూ నా మీద చూపించాడు. ఎందుకో అత్తయ్యకు నా మీద అంతకోపం. నే నందంగా ఉంటానని ఆవిడకు నూరీ ఇది. ఎప్పుడూ నన్ను కసురుకుంటుంది. ఆవిడ చేసిన కూరముక్కలు కూడా లెక్కపెట్టుకుంటుంది. ఒక రోజు నాలుగు ముక్కలు తరుగైనాయని, అవి నేను దొంగతనంగా తిన్నానని మామయ్యతో చెప్పింది. ఆయన నమ్మక ఏం చేస్తాడు?

కొంచెం పొదరాడే ఎప్పుడన్నా బీచికి ఆడుకోడానికి వెళ్తే మామయ్యతో చెప్పేది. నేను చదువుకోకుండా తిరుగుతున్నానని. ఆ రోజున మళ్ళీ నాకు దెబ్బలు. అబ్బ! ఆ దెబ్బలతో వీపు చిట్టెంకట్టింది. ఎవరితో చెప్పుకోను - మా అమ్మా, నాన్నా బ్రతికిఉంటే నాకీగతి పట్టేది కాదుగా. నా దురదృష్టంకొద్దీ వాళ్ళు చచ్చిపోవాలీ?

కీర్తివర్ధనుడికి ఆలోచనలు అలలుకంటె వడిగా వస్తున్నాయి. ఇసుక రేణువులు తన పిడికిలిలోకి తీసుకున్నాడు. వాటిలో తనకు మామయ్య, అత్తయ్యలు కన్పిస్తున్నారు. ఉలిక్కిపడ్డాడు. ఎవరో తన వీపుమీద దబదబా బాదినట్లున్నది. సముద్రపు హోరు వినిపిస్తున్నది. కీర్తివర్ధనుడి మనసులో ఆలోచనలు పరంపరలుగా వచ్చి పిక్కటిల్లి అలలలో కలసిపోతున్నాయి.

కీర్తివర్ధనుడు ఇప్పుడు పన్నెండేళ్ళ పసివాడు. థర్డ్ ఫారం చదువుతున్నాడు. ఇప్పుడు తన మనసు పరిపక్వం చెందిందనీ, తనను అనవసరంగా ఎవరైనా ఏ మాటైనా అన్నా, ఏ విధంగానైనా అవమానపరచినా తను సాహించలేననీ, తన మనసు చివుక్కుమంటుందనీ అతని అభిప్రాయం.

కీర్తివర్ధనుడి స్నేహితులంతా ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయినారు. తను ఏకాంతంగా సముద్రపుటొడ్డున కూర్చున్నాడు. ఎంతసేపు కూర్చున్నాడో తనకే తెలియదు. సముద్రంవైపు చూస్తూ ఉన్నాడు. సూర్యుడు వెళ్లిపోయి చంద్రుడు వచ్చాడు. చంద్రబింబం సముద్రపు నీళ్లలో ప్రతిఫలించి వెండి నీరుగా మారినట్లుగా ఉన్నది. తళుక్కుమంటూ ప్రతి అలా తన దగ్గరకే వస్తున్నట్లుగా ఉన్నది.

కీర్తివర్ధనుడు మామయ్య అత్తయ్యల విషయం మఱచిపోయినాడు. అక్కడ కూర్చున్నకొద్దీ

"వెంచాశ్రాం"

అతనికి ఆనందం ఎక్కువవుతున్నది. చంద్రుడు, వెన్నెల, సముద్రపుటలలూ ఇవన్నీ అతన్ని ఆహ్లాద పరుస్తున్నాయి.

కీర్తివర్ధనుడు చుట్టుప్రక్కల ఒకసారి చూశాడు. జనమెక్కడా లేరు. తన్ను తాను చూసుకున్నాడు. చాలా అలస్యం అయింది. ఇంటికి ఇఖపో అన్నది సముద్రం. ఇంటికి పోతే ఇంతవరకూ ఎక్కడ తిరిగి వస్తున్నావని కసిరి దెబ్బలు కొట్టరూ? అని అనుకుంటూ ఇంటికి పరుగెత్తాడు కీర్తివర్ధనుడు.

* * *

స్కూల్లో పిల్లలందరూ తనను పొగిడేవారు. నీకేంరా! మీ మామయ్యకు పిల్లలు లేరు. బోలెడు ఆస్తి ఉన్నది. నిన్ను పెంచుకుంటాడు. అప్పుడు మాతో పలుకుతావా? అనేవాళ్లు. ఆ మాటలు తలుచుకుంటే కీర్తివర్ధనుడికి బాకుతో పొడిచినట్లయింది. నన్నెవరూ పెంచుకోఖర్లేదు. అని అనుకున్నాడతను. కీర్తివర్ధనుడు వయసులో చిన్నవాడైనా, అతని మనసు పెద్దవాళ్ళవలె పరిపక్వముచెంది ఊహాలకందని స్థితిని కల్పిస్తుంది.

* * *

కీర్తివర్ధనుడికి మళ్ళీ దెబ్బలు తగిలినై. వారానికి కనీసం రెండుసార్లయినా అతనికి దెబ్బలు తప్పడంలేదు. ఈసారి తనకు అకారణంగా దెబ్బలు తగిలినయి.

గదిలో పెట్టిన పాలు నిజానికి పిల్లి త్రాగిపోయి ఉంటుంది. అత్తయ్య వచ్చి చూసుకునేటప్పటికి పాలులేవు. ఒళ్లు మండిపోయింది.

వర్ధన్...? అని పిల్చింది. నమ్రంగా వచ్చి నిల్చున్నాడు కీర్తివర్ధనుడు.

"గ్లాసులో పాలు త్రాగేవా లేదా? నిజం చెప్పు??"

గదమాయించింది అత్తయ్య.

"అత్తయ్యా నే నేమీ ఎరగను. నాకు పాలు కావలసివస్తే నిన్ను అడగనా, దొంగతనంగా ఎందుకు త్రాగుతాను. నన్ను అలా అనకు అత్తయ్యా" అని దీనంగా అనగలిగాడు.

"ఏడిశావ్. నిజంచెప్పు, లేకపోతే మామయ్యతో చెప్తాను. రాగానే, నీఇష్టం, ఆలోచించుకో" అనేటప్పటికి—

పెదిమలు విప్పకుండా చూస్తూ నిల్చున్నాడు. కీర్తివర్ధనుడి కంటిపాపల్లోకి చూసింది ఆమె. ఆమెకే భయంవేసింది. అతని కంటి పాపల్లో తన బింబం ప్రతిఫలిస్తున్నది. కంటి పాపల్లోకి ఆమె మరోమారు చూడలేకపోయింది. అతని కనుకొలుకులలోంచి రెండు వేడి నెత్తురు చుక్కలు! (కాదు కన్నీరు) భూమ్మీదపడ్డాయి. అవి "గంగలై, యమునలై" ప్రవహించి అత్తయ్యను, మామయ్యను ముంచి వేయగలవు.

కీర్తి వర్ధనుడికి వాళ్ళమీద జాలి కలిగింది. అంతపని చేయకూడదు అని అనుకున్నట్లున్నాడు.

మామయ్య వచ్చాడు. సవిస్తరంగా చెప్పింది అత్తయ్య.

"ఏంరా పాలు తాగేవా లేదా? నిజం చెప్పు."

"లేదు మామయ్యా."

"అబద్ధం."

"ఊహుం, త్రాగలేదు మామయ్యా—"

మామయ్యకు జాలి వేసింది. కీర్తి వర్ధనుడి కంటి పాపలు, అవి కరగి ఇతరులను కరిగించేట్లుగా ఉన్నాయి, మామయ్య ఏమీ మాట్లాడలేదు. అత్తయ్య ముందుకువచ్చి ఊరుకుంటే వాడు అంతే, అంటూ ఒక దెబ్బవేసింది. కాదు, రెండు ఫెళ్ ఆ, కీర్తివర్ధనుడు చలించలేదు. కొట్టిన దెబ్బలకు ఓర్చుకుంటున్నారు.

'మీకు బుద్ధిలేదు. నన్ను హింసిస్తున్నారు. నేను పాలు త్రాగలేదు. నేనంటే మీకు ఇష్టం లేకపోతే నేను మీదగ్గర ఉండను. నన్ను అనవసరంగా బాధించకండి." అని అంటుంటే, మామయ్య అత్తయ్య విభ్రాంతపోయి అతని వైపు చూస్తున్నారు.

మామయ్యకు కోపంవచ్చింది.

మరో దెబ్బ.

"ఇప్పటికైనా నిజంచెప్తావా లేదా."?

మరో దెబ్బ.

"అంతవాడివైనావా అప్పుడే."

మరో దెబ్బ.

"నిజమే చెప్తున్నాను మామయ్యా. నేను తాగలేదు." కీర్తివర్ధనుడి కంటి పాపలు మామయ్యనూ అత్తయ్యనూ ఏవగింపుగా చూస్తున్నాయి.

అతను సరిగా నిద్రపోలేదు. కలలోకూడా వీపుమీద ఎవరో కొడుతున్నట్లుగా ఉన్నది. కలలో అమ్మవచ్చి దగ్గరకు తీసుకున్నది. కీర్తివర్ధనుడు అమ్మను కౌగలించుకున్నాడు. లోకం కళ్లు అంతే నాయనా, విద్యకు నాచిట్టి తండ్రీ! ఆత్తయకు పిల్లలు కలిగితేగాని తెలియదులే. అమ్మ ఏదో రహస్యంగా చెప్పింది కలలో.

తెల్లవారిం తరువాత కీర్తివర్ధనుడు పక్కమీద లేడు.

తెల్లవారకముందే కీర్తివర్ధనుడు మామయ్యకు అత్తయ్యకు దూరమైనాడు.

మామయ్య అనుకుంటూ ఉంటాడు పాపం. అన్ని దెబ్బలు ఎందుకు కొట్టేను అని. అత్తయ్య అనుకుంటూ ఉంటుంది ఇంతపని చేస్తాడని నేను అనుకోలేదు అని

కీర్తివర్ధనుడు వెళ్ళాడు.

*     *     *

మామయ్య పసివాడి ఉయ్యాలతొట్టిదగ్గర నిలబడతాడు. రంగురంగుల చిలకల పందిరిని కదిలిస్తాడు. లక్క గిలకలను చప్పుడు చేస్తాడు. పసివాడు నవ్వడు. తుళ్లడు.

అత్తయ్య, ఏపని చేసుకుంటున్నా సరే మధ్యలోవచ్చి పసివాణ్ణి చూస్తుంది. వాడు గుప్పెళ్లుపట్టి ఊఁఊఁలు అనడు. వళ్లు సాగదీసుకోడు. పాటలుపాడుతుంది. వాడు ఆలకించినట్లు ఉండడు.

తమ బిడ్డను అత్తయ్యా మామయ్యాముద్దాడబోతారు. ఇంతలో తటపటాయిస్తారు.

తమబిడ్డ-వారికి ప్రత్యక్ష దైవం.

తమ బిడ్డకేసి ఇద్దరూ ఎంతో ప్రేమతో, భక్తితో, నమ్రులై చూస్తారు. పసివాడు తలిదండ్రులను చూస్తాడు. ఆచూపు! కీర్తివర్ధనుడి-ఓర్పుతో-చివరి దెబ్బలు తిన్నప్పుడు చూచిన చూపు!-ఇద్దరూ, అదోమాదిరి అవుతారు!!

అదికూడా ఒక కళ

# రాణికి బదులు రాయి!

కొత్త వెంకట గోవిందరావు

ఆధునిక ప్రపంచంలో దొంగతనాలు ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించాయి. ఈనాడు ప్రపంచంలో కాలపరిమాణంతో పాటువింతవింత దొంగతనాలు తలలెత్తాయి. దొంగతనాన్ని అవలోకించేముందు "అది కూడా ఒక కళ" అన్న వాదాన్ని మరచిపోకూడదు. దాన్ని పురస్కరించుకునే కలకత్తాలో ఒక ఆంగ్లేయ యువతి నిండు గౌనులోంచీ డబ్బునంచీ దొంగిలించిన ఎనిమిది సంవత్సరాల కుర్రవాడిని పోలీసులు పట్టుకున్న పిదప, ఆమె అతడిని శిక్షించకుండా వాడు చేసిన పనిలోని నైపుణ్యమునకు ఆశ్చర్యపడి బహుకరించినది.

సంప్రదాయంగా కొన్ని వంశాలలో యీ 'దొంగతనాలు' శతాబ్దాలుగా సాగివచ్చింది, ఇదొక జీవనోపాధిగా. తండ్రి ఆ విద్యలోని మెళకువలు కొడుకుకు బోధించడం కూడా కద్దు. ఈనాడు జరుగుతున్న వింత దొంగతనాలకు తగినట్లుగా వాళ్ళను పట్టుకోవడానికి అనుగుణ మార్గాలుకూడా తెలుసుకోబడ్డాయి.

పూర్వపు దొంగతనాల్లో బందిపోటూ దోపిడీ బహిరంగంగా జరిగేవి. కాని సాధారణంగా గోడలు త్రవ్వి యిండ్లలో చొరబడి సొమ్ము కాజేయడం జరుగుతుండేది. శిక్షలు కూడా నానాటికీ మార్పులుపొందుతూవచ్చాయి. దొంగను బంధించుటకు ఆవశ్యకమైన పద్ధతులు అంతకన్నా సూక్ష్మబుద్ధితో। తెలుసుకోవాలి. అందుకనే "దొంగను పట్టుకోడానికి దొంగే కావాలి", అన్నారు.

ఈనాటి దొంగతనాలు సాధారణవ్యక్తి ఊహించుటకు వీలుగాని పద్ధతులలో జరుగు